www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 10 జులై 2024
5



వైఎస్‌ఆర్

హెచ్‌ఎంపై సస్పెన్షన్ రద్దు చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : కలుషితమైన నీరు తాగి విద్యార్థులు అస్వస్థతకు గురైనారనే కారణంగా ఖాజీపేట బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యా యులు టి.ఉమాదేవిపై విధించిన సస్పెన్షన్‌ను రద్దు చేయాలని ఫ్యాప్టో నాయకులు డిఆర్ఒ గంగాధర్ గౌడ్‌కు విజ్ఞప్తి చేశారు. మంగళవారం వారు ఆయనకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో చైర్మన్ మాదన విజయ కుమార్, సెక్రటరీ జనరల్ ఎస్.మొహమ్మద్ ఇర్షాద్ మాట్లాడుతూ ఖాజీపేట బాలికల ఉన్నత పాఠశాలలో వాస్తవానికి ప్రధానోపాధ్యాయులు తప్పేమీ లేదన్నారు. పాఠశాలలోని వాటర్ ట్యాంక్‌లో నీటిని పలువురు విద్యార్థులు తాగినప్పటికీ కేవలం ముగ్గురు, నలుగురు విద్యార్థులు మాత్రమే అస్వస్థతకు లోనయ్యారన్నారు. వర్షాకాలం ప్రారంభమై కొన్ని ప్రాంతాలలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయని పేర్కొన్నారు. అందులో భాగంగానే డయేరియా కారణంగా కొంతమంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారన్నారు.

వాడివేడి


- ఉచిత ఇసుక ఉత్తిదే!
- వంట ఏజెన్సీ, వార్డెన్ల తొలగింపు ఒట్టిదే : మంత్రి
- కాలేటివాగుపై స్పష్టమైన హామీనివ్వండి : ఎంపీ
- జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో నేతల గళం



జడ్‌పి సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



హాజరైన జడ్‌పిటిసిలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు



మాట్లాడుతున్న కలెక్టర్




మాట్లాడుతున్న ఎంపీ అవినాష్‌రెడ్డి



మాట్లాడుతున్న కమలాపురం ఎమ్మెల్యే



మాట్లాడుతున్న మైదుకూరు ఎమ్మెల్యే



మాట్లాడుతున్న జడ్‌పిమాజీ చైర్మన్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఉచిత ఇసుక విధానం లోపభూయిష్టంగా ఉందని, డిఎంఎఫ్, సీనరేజీ, నిర్వహణ ఖర్చులను వసూలు చేస్తూ ఉచితంగా ఇసుక పంపిణీ చేస్తున్నామని ప్రకటించడం హాస్యాస్పదమని వైసిపి సభ్యులు నిలదీశారు. మంగళవారం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం చైర్మన్ జేష్టాది శారద అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ అందుబాటులో ఉన్న ఇసుక పంపిణీ చేయ డానికి సంబంధించిన తాత్కాలిక విధానమే ఇదని, రివర్ బెల్ట్‌లో ఇసుక తవ్వకాలపై సుప్రీం కోర్టు వ్యతిరేకత నేపథ్యంలో పూర్తిస్థాయి ఇసుక విధానానికి రూపకల్పన చేస్తున్నామని చెప్పారు. ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ రాయచోటి భూసార పరీక్షా కేంద్రాన్ని పునరుద్ధరిం చాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో పంటల బీమా ప్రీమియం రైతులే చెల్లించడం ద్వారా రైతాంగం నష్టపో యిందన్నారు. సకాలంలో ప్రీమియం చెల్లించకపోవడంతో అన్యాయానికి గురయ్యారని చెప్పారు. ఏటా జూన్ చివరి నాటికి ఇన్సూరెన్స్ లభించేదని, జులై గడుస్తున్నప్పటికీ ఎటువంటి కదలిక లేదని, ఏదైనా బటన్ నొక్కేలా చూడాలని వేంపల్లి జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. మంత్రి జోక్యం చేసుకుని తాము బటన్లు నొక్కబోమని, ప్రత్యా మ్నాయాల్ని అన్వేషిస్తున్నామని తెలిపారు. కమలాపురం ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి మాట్లాడుతూ 2019 ముందు రిజిస్ట్రరైన రైతులకు పిఎం కిసాన్ పడుతోందని, అనంతరం రిజిస్ట్రరైన రైతాంగం నష్టపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. మంత్రి స్పందించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాలను, రైతు భరోసా కేంద్రాల పనితీరును సమీక్షిస్తున్నామని, రాబోయే సమావేశం నాటికి రైతు ప్రయోజనాలే పరమావధిగా ముం దుకు వస్తామని చెప్పారు. బి.మఠం మండలం ముడమాల, మలుగుడుపాడు, మహదేవపల్లి, సింహాద్రిపురం, కాశినాయన మండలాల్లోని పలు పాఠశాలలకు ఉపాధ్యాయుల, భవనాల కొరత వేధిస్తోందని సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా వంట ఏజెన్సీలు, వార్డెన్లు, ఫీల్డ్‌అసిస్టెంట్లను తొలగిస్తామనే పేరుతో టిడిపి కార్యకర్తలు బెదిరింపులకు పాల్పడు తు న్నారని చెప్పారు. మంత్రి స్పందిస్తూ చిరుద్యోగుల బెదిరింపులను పునరావృతంగా కానివ్వబోమని తెలిపారు. ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ పులివెందుల హౌసింగ్‌లో అవకతవకలు ఉన్నాయని, ఇళ్లు ఉన్న వారికి, ఆధార్ కార్డులు లేని వారికీ ఇళ్లు కేటాయించడంపై కమిటీ వేసి వాస్తవాలను నిగ్గు తేల్చాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ స్పందించి వారంలోపు వాస్తవాలను వెలుగులోకి తెస్తామని హామీనిచ్చారు. రాజంపేట నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి సుగవాసి బాల సుబ్రమణ్యం ఒంటిమిట్ట ఎంపిడిఒ కార్యాలయంలో అధి కారులతో సమావేశం నిర్వహి ంచాడని ప్రొటోకాల్‌కు విరుద్ధమని ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి సభ దృష్టికి తీసు కొచ్చారు. మంత్రి స్పందిస్తూ రాష్ట్రంలోని వైసిపి ఎమ్మెల్యేలకు ప్రొటోకాల్ సమస్యల్ని రానివ్వబోమని తెలిపారు. కమలాపురం ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి మాట్లాడుతూ 2019 ముందు నిర్మించిన హౌసింగ్ లబ్ధిదారులకు బిల్లులు రావడం లేదని, బాధిత లబ్ధిదారులకు సత్వరమే బిల్లుల చెల్లింపులు చేయాల్సిన అవసరం ఉందన్నారు. పోరుమామిళ్ల జడ్‌పిటిసి 2014 నుంచి 2019 వరకు హౌసింగ్ లబ్ధిదారులకు బిల్లులు రాలేదని సభ దృష్టికి తీసుకొచ్చారు. రైల్వేకోడూరు జడ్‌పిటిసి పాలెంకోట రత్నమ్మ రైల్వేకోడూరు ఎస్‌టి కాలనీలోని తాగునీటి బోరుకు కరెంటు కనెక్షన్ ఇవ్వకపోవడంతో తాగునీటి తీవ్ర ఇబ్బందులు పడు తున్నారని సభ దృష్టికి తెచ్చారు. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి స్పందించి తాగునీటి బోర్లకు రిక్విజిషన్ లెటర్ అందిన వెంటనే మానవత దృక్పథంతో విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి స్పందించి జిల్లాలో వ్యవసాయ బోర్లకు కనెక్షన్లు ఇవ్వడంలో నిర్లక్ష్యం నెలకొందని, సామాన్య రైతులకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని తెలిపారు. రాయచోటి- వేంపల్లి-ప్రొద్దుటూరు జాతీయ రహదారి, మైదుకూరు -పోరుమామిళ్ల జాతీయ రహదారి నిర్మాణ పనులు నిలిచిపోవడంపై ప్రశ్నించారు. ఎన్‌హెచ్ ఇఇ స్పం దించి కాంట్రాక్టర్ చని పోవడంతో నిలిచిపోయాయని, పలు దఫాలుగా నోటీసులు జారీ చేశామని, చివరికి టెర్మినేట్ చేసే ఆలోచనల్లో ఉన్నామని వివ రించారు. సిద్ధవటం మండలం మూలపల్లి ప్రాంతం నుంచి ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగి పోతోందని జడ్‌పిటిసి శ్రీకాంత్‌రెడ్డి కలెక్టర్ దృష్టికి తీసు కొచ్చారు. చక్రాయపేట జడ్‌పిటిసి మాట్లా డుతూ రాష్ట్రంలో వైసిపి కార్యకర్తలపై దాడులు చేయడం తగదని, ఇటీవలే వేంపల్లిలో వైసిపి కార్యకర్త తల పగుల కొట్టడం దారుణమని మంత్రి దృష్టికి తెచ్చారు. మంత్రి స్పందిస్తూ ఎటువంటి రాజకీయ కక్షలకు పాల్పడబోమని, వైసిపి హయాంలో చేసిన ప్రతీకార దాడులతో పోలిస్తే ఎంత శాతమో చెప్పాలని ప్రశ్నించారు. మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ మాట్లా డుతూ రాజోలి జలాశయాన్ని నిర్మిస్తే కెసి కెనాల్ స్థిరీకరణ సాధ్యమన్నారు. ఫలితంగా 92 వేల ఎకరాలకు భద్రత లభి స్తుందని తెలిపారు. రాజోలి ముంపు ప్రాంతాన్ని కర్నూలు జిల్లా నుంచి కడప జిల్లాకు బదలాయించేలా చూడాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. చక్రాయపేట జడ్‌పిటిసి కాలేటివాగు రిజర్వాయర్ పనులతో రాయచోటి, మదనపల్లి, పీలేరు, పుంగనూరు ప్రాంతాలకు ప్రయోజనం చేకూ రుతుందని తెలిపారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన ప్రాజెక్టు పనుల్ని రాజకీయ కక్షల కారణంగా నిలిచిపోతే తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కడప ఎంపీ జోక్యం చేసుకుని కాలేటివాగు ప్రాజెక్టు పనులకు భరోసా ఇవ్వాలని కోరారు. మంత్రి స్పందిస్తూ పోలవరం ప్రాజెక్టు పునర్నిర్మాణం చేపడు తున్నామని, కాలేటివాగు ప్రాజెక్టు నిర్మాణ పనులు ఎందుకు చేపట్టబోమని ప్రశ్నించారు. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల పనుల్ని సమీక్షిస్తు న్నామన్నారు. పిఎల్ఆర్ కంపెనీ తప్పు చేయకుంటే ఎటువంటి కక్షలకు పాల్పడబోమని, తప్పు చేసినట్లు తేలితే ఉపేక్షిం చబోమని పేర్కొన్నారు. బి.మఠం ఎంపిపి మాట్లాడుతూ బ్రహ్మసాగర్ గేట్ల మరమ్మతులు చేపట్టాలని, రిజర్వాయర్ ఖాళీగా మారిన నేపథ్యంలో మరమ్మతులు చేయడం సుల భమన్నారు. ఇరిగేషన్ సిఇ స్పందించి తాత్కాలిక మరమ్మతులు చేపట్టామని, రూ.1.60 కోట్ల శాశ్వత మరమ్మతు పనులకు ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. సమావేశంలో ఎమ్మె ల్యేలు డాక్టర్ దాసరి సుధ, ఎమ్మెల్సీలు రామచంద్రారెడ్డి, రమేష్ కుమార్ యాదవ్, కలెక్టర్ లోతేటి శివశంకర్, గణేష్‌కుమార్, శ్రీధర్, జడ్‌పిటిసిలు, ఎంపిపిలు, ఉమ్మడి జిల్లాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి




ఎంహెచ్‌ఒకు వినతి పత్రం అందజేస్తున్న మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్‌లో ఆప్కాస్, కోవిడ్-19 నుంచి పనిచేస్తున్న కార్మికుల పిఎఫ్, ఇఎస్ఐ విషయమై మంగళవారం ఎంహెచ్‌ఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎపి మున్సిపల్ ఫెడరేషన్ నగర కమిటీ అధ్యక్షులు సుంకర రవి మాట్లా డుతూ కార్మికుల పిఎఫ్ విషయమై 7, 8 సంవత్సరాలుగా డేట్ అఫ్ బర్త్ కానీ, తండ్రి పేరు కానీ తప్పులు ఉన్నవాళ్లు అవి మార్పులు చేయకుండా అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల పిఎఫ్‌కు సంబంధించి ఒక కంప్యూటర్ ఆపరేటర్‌ను ఏర్పాటు చేశారని తెలిపారు. కంప్యూటర్ ఆపరేటర్ ఇచ్చినా ఇప్పటికీ తప్పులు సవరించకపోవడంలో పిఎఫ్ అధికా రులు లోపం అన్నారు. పిఎఫ్ కార్యాలయంలో అధికారుల తీరు చాలా నిర్లక్ష్యంగా ఉందని చెప్పారు. పేరుకు మాత్రమే కడప జిల్లాలో రీజనల్ కార్యాలయం ఉన్న ఆ రీజినల్ అధికారి కమిషనర్ ఉద్యోగుల, కార్మికుల సమస్యలు పరిష్కరించి డిజిటల్ సిగ్నేచర్ చేయడానికి ఆయన ఎంత సమయం పడుతుంది, జాయింట్ డిక్లరేషన్ ఫారం ఇచ్చినా కూడా ఇంతవరకు దాని సరిచేసిన దాఖలాలు లేవని పేర్కొన్నారు. గ్రీవెన్స్‌లో వారం రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని చెబుతున్నారే తప్ప పరిష్కరించడం లేదని విమ ర్శించారు. ఆరు నెలలుగా సమస్య పరిష్కారం కాలేదని తెలి పారు. నగరపాలక కమిషనర్ జోక్యం చేసుకుని పిఎఫ్ రీజినల్ కమిషనర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు, పిఎఫ్ అధికారులు కార్మికుల సమస్యలను పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కొనసాగిస్తామని చెప్పారు. కార్యక్ర మంలో నాగరాజు, పుల్లయ్య, చిన్నస్వామి, కార్మికులు పాల్గొన్నారు.

దుష్ప్రచారాలు మానుకోండి

వైసిపి జిల్లా అధ్యక్షులు కె.సురేష్ బాబు



సమావేశంలో మాట్లాడుతున్న సురేష్‌బాబు

ప్రజాశక్తి - కడప

వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డిపై దుష్ప్రచారాలు చేయడం మానుకోవాలని కడప జిల్లా వైసిపి అధ్యక్షులు సురేష్ బాబు అన్నారు. ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలు నెరవేర్చడంపై చంద్రబాబు ప్రభుత్వం దృష్టి సారించాలని సూచించారు. ఉచిత ఇసుక పేరుతో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం మోసం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పులివెందుల ఎమ్మెల్యేగా వైఎస్ జగన్, కడప ఎంపీగా వైఎస్ అవినాష్ రాజీనామా అంటూ వచ్చిన వార్తలను ఖండించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. 2011లో జరిగిన కడప పార్లమెంట్ ఉప ఎన్నికలలో 'కడప దెబ్బ ఢిల్లీ అబ్బా అనేలా ప్రజల తీర్పు ఇచ్చారు..ఇది మరిచిపోయారా? అని అన్నారు. వైఎస్ జగన్‌కు వచ్చిన మెజారిటీ ఒక చరిత్రాత్మకం అని గుర్తు చేశారు. కడప ఉప ఎన్నిక అంటూ తప్పుడు కథనాలు రాగానే రేవంత్ రెడ్డి స్పందించడం సిగ్గుచేటు అన్నారు. ఉచిత ఇసుక అని ప్రజలను మభ్య పెట్టారు అన్నారు. ఒక ట్రాక్టర్ ఇసుక రూ.3500 అమ్ముతున్నారు, 1700 ప్రభుత్వానికి చెల్లించేలా, మిగతా మొత్తం ట్రాక్టర్‌కు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలకు మోసపూరిత హామీలు ఇచ్చారు తప్ప, అధికారంలోకి వచ్చిన నెలలోపే ప్రజలను నిట్ట నిలువునా ముంచుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీలు నెరవేర్చిన ఏకైక నాయకుడు వైఎస్ జగన్ ఒక్కడే అని చెప్పారు. విలేకరుల సమావేశంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఆందోళనలు జయప్రదం చేయండి

ప్రజాశక్తి- కడప అర్బన్ : కార్మిక చట్టాలను రద్దుచేసి, వారి హక్కులను కాలరాయడానికి ప్రయత్నం చేస్తున్న బిజెపి ప్రభుత్వానికి నిరసనగా సిఐటియు ఆల్ ఇండియా పిలుపులో భాగంగా జిల్లాలో ఉన్న అన్ని మండల తహశీల్దార్ కార్యాలయాల వద్ద బుధవారం నిర్వహించబోయే ఆందోళనలను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె. శ్రీనివాసులురెడ్డి, మనోహర్, జిల్లా కోశాధికారి బి.లక్ష్మీదేవి సంయుక్త ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ సంస్థలను అమ్మేయడమే ప్రధానమైన లక్ష్యంగా పనిచేస్తుందని పేర్కొన్నారు. ఎల్ఐసి, బిఎస్ఎన్ఎల్, పోస్టల్, డిఫెన్స్, రైల్వే ఇలా ప్రభుత్వ రంగ సంస్థలన్నీటిని ప్రయివేటీకరించడం దుర్మార్గమని తెలిపారు. కార్మిక వ్యతిరేక చట్టాలను, లేబర్ కోడ్‌లను అమలు చేయడానికి తీవ్ర ప్రయత్నం చేయడం దారుణమని పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించి స్కీం వర్కలను పర్మినెంట్ చేయాలని తెలిపారు. విభజన చట్టంలో ఇచ్చిన హామీలను జిల్లాలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని తెలిపారు. అధికారంలోకి వచ్చిన వెంటనే అంగన్వాడీలకు, ఆశాలకు, మున్సిపల్, కాంట్రాక్టు, అప్కాస్ ఉద్యోగులకు జీతం పెంచుతామని హామీ ఇచ్చిందని, ఆ హామీని నెరవేర్చాలని పేర్కొన్నారు. జిల్లాలో కార్మిక వర్గం ఎదుర్కొంటున్న ఆటో, హమాలీ, తోపుడు, బిల్డింగ్, తదితర అసంఘటిత కార్మికులు, కాంట్రాక్టు ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులు కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని తెలిపారు.

మంత్రిని కలిసిన అధికారులు

ప్రజాశక్తి - కడప అర్బన్ : జడ్‌పి సర్వ సభ్యసమావేశంలో పాల్గొనడానికి మంగళవారం కడప ఆర్‌అండ్‌బి గెస్ట్ హౌస్‌కు వచ్చిన రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్ర సాద్‌రెడ్డిని పలువురు జిల్లా అధికారులు కలిసి అభినందనలు తెలిపారు. ఆయన్ను కలిసిన వారిలో డిటిసి మీరా ప్రసాద్, కడప ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ వెంకటపతి, సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి వేణుగోపాల్ రెడ్డి, తహశీల్దార్ వెంకటరమణ, ఆర్‌టిసి ఆర్‌ఎం గోపాల్‌రెడ్డి, అధికారులు ఉన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సాధించిందని, రవాణా శాఖ, అధికారులు సిబ్బంది సమన్వయంతో పనిచేసి ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు.

పెండింగ్ పనులను పూర్తి చేయించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : వేంపల్లిలోని ఆర్‌టిసి బస్టాండ్ అసంపూర్తి పను లను పూర్తి చేయించాలని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, మాజీ ఎంపిటిసి జి.వి. రమణ కోరారు. మంగళవారం కడప ఆర్‌అండ్‌బి గెస్ట్ హౌస్‌లో ఉన్న రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లె రాంప్రసాద్ రెడ్డిని కలిసి ఆర్‌టిసి బస్టాండ్ సమస్యల గురించి మంత్రికి వివరించారు. వేంపల్లిలో రూ.2.32 కోట్లతో బస్ స్టేషన్ నిర్మాణ పనులు చేపట్టారన్నారు. కాంట్రాక్టర్ మొత్తం పనులు పూర్తి చేశారని ఇందులో రూ.32 లక్షలు మిగిలిపోయిందన్నారు. వేంపల్లిలో రోడ్ల విస్తరణకు సంబంధించి బస్ స్టేషన్ ఇన్, అవుట్ ఉన్నచోట్ల కాల్వపనులు చేపట్టకుండా గుత్తేదారు వదిలిపెట్టి వెళ్లారన్నారు. ప్రస్తుతం ఆర్‌టిసి బస్టాండ్‌కు సంబంధించి మిగిలి ఉన్న రూ.32 లక్షలతో బస్టాండుకు ఇన్, అవుట్ ఉన్నచోట్ల అప్రోచ్ పనులు పూర్తి చేయించి మీరే బస్ స్టేషన్‌ను ప్రారంభించాలని మంత్రిని కోరారు. ఈ మేరకు మంత్రి ఆర్‌ఎంకి ఫోన్ చేసి వేంపల్లి ఆర్టీసీ బస్‌స్టేషన్ వద్ద ఇన్, అవుట్ ఉన్న ప్రాంతంలో అప్రోచ్ పనులు పూర్తి చేయించి త్వరితగతిన బస్ స్టేషన్‌ను ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని ఆదేశించారు.

మంత్రి ఆదేశాలతో రైతు సమస్య పరిష్కారం



విద్యుత్ స్తంభాలు నాటిన అధికారులు

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప జిల్లా ఖాజీపేట మండలం నాగసానిపల్లెలో అబ్బయ్య అనే రైతు పొల ంలో విద్యుత్ తీగలు నేలను తాకు తుండేవి. కొంత కాలముగా రైతు తాను పడుతున్న ఇబ్బందులను పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదు. ఇటీవల వర్షాలు పడడంతో దుక్కి దున్ను కోవాలని రైతు భావించాడు. ఈక్రమంలో పొలంలో అడ్డుగా ఉన్న విద్యుత్ తీగలను కుటుంబ సభ్యుల సాయంతో పట్టుకునేలా చూసుకున్నారు. దీనికి సంబంధించి ఫొటో అమరావతిలో ఉన్న ఎపి విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కంటపడింది. రైతన్న ఇబ్బంది చూసిందే తడవుగా స్థానికంగా ఉండే అధికారులకు మంత్రి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. యుద్ధ ప్రాతిపదికన అబ్బయ్య పొలంలో స్తంభం ఏర్పాటు చేశారు. ఏళ్ల తరబడి పరిష్కారం కానీ సమస్య మంత్రి ఆదేశాలు అందిన కేవలం 3 గంటల్లోనే పరిష్కారమైంది. మంత్రి చూపించిన చొరవకు రైతన్న ఆనందం వ్యక్తం చేశారు. మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

హెల్మెట్ వాడకపోవడం చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి - కడప

వాహనదారులు హెల్మెట్ వాడకపోవడం చట్టరీత్యా నేరమని లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాది మనోహర్ అన్నారు. మనల్ని మనం రక్షించుకోవడమే కాకుండా మన కుటుంబాన్ని రక్షించుకోవాలి అంటే తప్పనిసరిగా ప్రతి ఒక్కరు హెల్మెట్ వాడాలని సూచించారు. మంగళవారం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లచే వాహనదారులు హెల్మెట్ ధరించడం పై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ప్రతి ఒక్క వాహనదారుడూ హెల్మెట్ ధరించి సురక్షితంగా గమ్యస్థానాన్ని చేరుకోవాలని చెప్పా రు. రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా హెల్మెట్ ధరించడం ద్విచక్ర వాహ నదారులకు క్షేమమని తెలిపారు. ముఖ్యంగా యువత ద్విచక్ర వాహనం అతివేగంగా నడపడం హెల్మెట్ ధరించకపోవడం వల్ల ప్రమాదాలు జరిగి మరణించడం జరుగుతుందని తెలిపారు. యువత మరి ముఖ్యంగా విద్యా ర్థులు రోడ్డు ప్రమాదంలో మరణిస్తే ఆ కుటుంబానికి తీరని నష్టం జరుగు తుందని అన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ ప్రయాణం కొనసాగించాలని సూచించారు. అతివేగం ప్రాణానికి ముప్పు అని గ్రహించి గమ్యాన్ని చేరు కోవాలని తెలిపారు. రూల్ 167 ప్రకారం రోడ్డు భద్రతకు సంబంధించి ఎల క్ట్రానిక్ పరికరాలైన స్పీడ్ కెమెరా, క్లోజ్డ్ సర్క్యూట్, టెలివిజన్ కెమెరా, స్పీడ్ గన్, బాడీ వేరిబుల్ కెమెరా, తదితర టెక్నాలజీ పరికరాలను రాష్ట్ర ప్రభుత్వం రోడ్డు భద్రతకు వాడుతున్నట్లు తెలిపారు. ఐఎస్ఐ మార్క్ గల నాణ్యమైన హెల్మెట్లను వాడాలని, హెల్మెట్ ధరించడం పై అవగాహన పెంచుకోవాలి అన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల మనోహర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, పారా లీగల్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

'విశ్వ కర్మ యోజన'ను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - కడపఅర్బన్ : ప్రధాని మంత్రి అమలు చేస్తున్న విశ్వ కర్మ యోజన పథకాన్ని ప్రతి కార్మికుడూ సద్వినియోగం చేసుకోవాలని విశ్వ కర్మ యోజన పథకం మేనేజర్ అంజూ కోరారు. మంగళవారం నగరంలో శిక్షణ పొందిన చేతి వృత్తిదారులను కలిసి శిక్షణలో నేర్చుకున్న అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన విశ్వ కర్మ పథకానికి 18 రకాల చేతి వృత్తిదారుల దరఖాస్తులు చేసుకోవచ్చు అన్నారు. ఈ పథకానికి దరఖాస్తులు చేసుకున్న వారికి ఆయా వృత్తులకు సంబంధించి 6 రోజుల పాటు ఉచితంగా శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. 6 రోజుల పాటు శిక్షణ పొందిన వారికి స్టయిఫండ్ కింద రూ.4 వేలు ఇస్తారని పేర్కొన్నారు. వేంపల్లెకు ఉన్న 150 మంది కార్మికులు శిక్షణ పూర్తి చేసినట్లు చెప్పారు. శిక్షణ పూర్తి చేసుకున్న నెల రోజులకు రూ.15 వేలు విలువ చేసే పని ముట్లు కూడా ప్రభుత్వం ఉచితంగా ఇస్తుందని చెప్పారు. ఉపాధి కోసం రూ. లక్ష రుణాన్ని ఇస్తుందని పేర్కొన్నారు. 5 శాతం వడ్డీ కట్టాల్సిన వస్తుందని తెలిపారు. కాబట్టి ఉపాధి పొందేందుకు ప్రతి కార్మికుడు విశ్వ కర్మ యోజన పథకానికి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. శిక్షణ శిబిరంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల విజయం

ప్రజాశక్తి - కడప : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన ఎన్నికల ప్రచారంలో భవన నిర్మాణ కార్మికులకు ఇసుక ఉచితంగా పంపిణీ చేసే వాగ్దానాన్ని నిలబెట్టుకున్నందుకు టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరికృష్ణ కృతజ్ఞతలు తెలి యజేశారు. కడప నియోజకవర్గ ఎమ్మెల్యే మాధవి ఆదేశాలనుసారం మంగళవారం కడప నగరం 45వ డివిజన్ తారక రామ్ నగర్‌లోని భవన కార్మికులతో నారా చంద్రబాబునాయుడు చిత్రపటానికి భవన కార్మికులతో కలిసి పాలాభిషేకం చేసి స్వీట్ల పంపిణీ చేశారు.



చంద్రబాబు చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

కడప కేంద్రంలో పరిశ్రమలు ఏర్పాటు చేయండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఎపి విద్య, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్‌ను విజయవాడలో కడప ఎమ్మెల్యే మాధవి మర్యాదపూర్వకంగా కలిసి కడప కేంద్రంగా పరిశ్రమలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు సిఎం అయ్యాక అనేక పరిశ్రమలు రాష్ట్రానికి తరలిరావడం ఆనందంగా ఉందని అన్నారు. 10 నుండి 15 వేల మంది ఉపాధి అవకాశాలు వచ్చేలా కడపకు పరిశ్రమలు తీసుకురావాలని మంత్రిని కోరారు. దీనికి మంత్రి లోకేష్ సానుకూలంగా స్పందించారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి - గోపవరం : వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్, గుంటూరు ఆదేశాల మేరకు మంగళవారం బద్వేల్ వ్యవసాయ డివిజన్ పరిధిలోని గోపవరం సాయికృష్ణ ట్రేడర్స్, పిసిఎన్ ఆగ్రో ఏజెన్సీస్ దుకాణాలను రాష్ట్ర వ్యవసాయ అండ్ విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. లైసెన్సు గడువు, స్టాక్ రిజిస్టర్ నిల్వలు, గోడౌన్స్ నిల్వలు, రసీదు బుక్స్, ఇన్వాయిస్స్, వే బిల్స్, ఫార్మ్-ఒలు క్షుణ్ణంగా పరిశీలించారు. చట్టబద్ధ వ్యాపారం చేయాలని, ధరల, స్టాక్ బోర్డు పట్టికలో వివరాలు రాయాలని సూచి ంచారు. రైతులకు కొన్న మొత్తానికి రసీదులు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. గడువు ముగిసిన ఉత్పాదకాలు ఎట్టి పరిస్థితిలో విక్రయించరాదన్నారు. బిల్లులో రైతుల పూర్తి చిరునామా మొబైల్ నెంబర్, సంతకాలు, వేలి ముద్రలు సేకరించాలన్నారు.

ప్రభుత్వ వైద్య కళాశాల జూడా నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి- కడప సిటీ : కడప ప్రభుత్వ వైద్య కళాశాల జూనియర్ డాక్టర్ అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా డాక్టర్ ఎస్.ఖదీర్ అహ్మద్, ఉపాధ్యక్షులుగా డాక్టర్ అశ్విని, డాక్టర్ అల్లూరి నిఖిల్ సింగ్, ప్రధాన కార్యదర్శులుగా డాక్టర్ విష్ణుప్రసాద్, డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి ఎన్నికయ్యారు. నూతన కమిటీని ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.సురేఖ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వై.విజయభాస్కర్ అభినందించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు కళాశాలలోని సమస్యల పరిష్కారం కోసం ప్రిన్సిపల్‌కు వినతి పత్రం అందజేశారు.

గర్భిణులు ఆరోగ్య సూత్రాలు పాటించాలి

ప్రజాశక్తి-కాశినాయన : ప్రతి ఒక్క గర్భిణీ ఆరోగ్య నిబంధనలు పాటించి వైద్యాధికారుల సూచనల మేరకు ఉండాలని మండల వైద్యాధికారి ప్రశాంతి తెలిపారు. మంగళవారం మండల కేంద్రమైన నర్సాపురంలోని ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు ఆమె పరీక్షలు నిర్వహించారు. బిపి, షుగర్, రక్తపరీక్ష నిర్వహించి వారికి తగు సూచనలు ఇచ్చారని చెప్పారు. ప్రమాదకర గర్భిణులను గుర్తించి వారికి అక్కడే వైద్యం చేస్తారన్నారు. గర్భిణులు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. గర్భిణులు ఎలాంటి ఆహారం తినాలా అనే విషయాలపై ప్రత్యేకంగా సూచించారు. ఐరన్, జింక్ టాబ్లెట్ల వల్ల కలిగే ఉపయోగాల గురించి వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, ఆరోగ్య సిబ్బంది, గర్భిణులు పాల్గొన్నారు.

నేడు చెన్నూరు మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-చెన్నూరు : మండల అభివృద్ధి సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10:30 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ సుబ్రహ్మణ్యం శర్మ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కమలాపురం శాసనసభ్యులు పుత్త కృష్ణ చైతన్య రెడ్డి హాజరవుతున్నట్లు చెప్పారు. సమావేశంలో అన్ని ప్రభుత్వ శాఖలకు సంబంధించిన అభివృద్ధి పనులపై చర్చిస్తారన్నారు.

అక్రమ అడ్మిషన్లపై చర్యలేవీ?

ప్రజాశక్తి- కడప అర్బన్ : ప్రభుత్వ నిబంధనలు అటకెక్కించి విద్యను వ్యాపారంగా మార్చిన చైతన్య, నారాయణ, భాష్యం పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షులు రమావత్. జగన్ నాయక్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. జీవో నంబర్ 1, 42లను ప్రతి పాఠశాలలో అమలుకు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.



ప్రజలకు అవగాహన కలిగిస్తున్న మున్సిపల్ కమిషనర్

డయేరియా వ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

డయేరియా వ్యాధిపై అవగాహన సదస్సును మున్సిపల్ కమిషనర్ వెంకట రమణారెడ్డి నిర్వహించారు. మంగళవారం పట్టణంలోని పాత మార్కెట్‌లో ఉన్న వైఎస్ జయమ్మ కాంప్లెక్స్‌లో డయేరియా వ్యాధిపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ డయేరియా వ్యాధిపై జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. నిర్లక్ష్యం చేయకూడదని తెలిపారు. ఆహార పదార్థాల్లో తగినంత జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. హోటళ్లలో శుభ్రత పాటించాలన్నారు. వంటలు చేసే సమయంలో పదార్థాలను శుభ్రం చేయాలన్నారు. కల్తీ పదార్థాలను వాడితే సంబంధిత హోటల్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీధర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

వేంపల్లె : వాతావరణం కాలుష్యం వల్ల వచ్చే డయేరియా వ్యాధిపై ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యురాలు స్వాతిసాయి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డయేరియా, డెంగీ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలని కోరారు. వేడిగా ఉన్నప్పుడే ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్య సమస్యలు రావన్నారు. చెడిపోయిన ఆహారం తింటే డయోరియా వ్యాధి సోకుతుందని తెలిపారు. డెంగీ, డయోరియా వ్యాధులను అరికట్టాలంటే పరిసరాలు శుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు, సిహెచ్ఒ వెంకటరత్నం, సూపర్‌వైజర్ ఫకృద్దీన్, హైల్త్ ఎడ్యుకేటర్ షఫీ ఉన్నిసా బేగం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఓబుల్ రెడ్డి, మల్లేశ్వరమ్మ, అధ్యాపకులు శ్రీకాంత్‌రెడ్డి, ఆశా, ఆరోగ్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

- ట్రిపుల్ఐటి పరిపాలనాధికారి పి.రవికుమార్

ప్రజాశక్తి - వేంపల్లె

ట్రిపుల్ఐటిలో విద్యార్థులుగానీ, ఉద్యోగులుగానీ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆర్‌కెవ్యాలీ పరిపాలనాధికారి పెనుగొండ రవికుమార్ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని ఇడుపులపాయ ట్రిపుల్ఐటిలో ఉన్న వసతిగృహాల ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎఒ పెనుకొండ రవికుమార్ ఆధ్వర్యంలో సెక్యూరిటీ అధికారులు, ఫ్యాకల్టీలతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతిగృహాల్లో ఉన్న విద్యార్థులు మద్యపానం, ధూమపానం వంటివి చేస్తే అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. పరిశుభ్రత పాటించాలని కోరారు. ట్రిపుల్ఐటిలో గంజాయి దొరకడం దురదృష్టకరమన్నారు. వసతిగృహాల వద్ద ఉన్న సెక్యూరిటీ గార్డులు, కేర్ టెకర్‌లు నిఘా పెంచాలని, తనిఖీలు చేస్తూండాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయా విభాగాల అధికారులతో సమస్యలపై, విద్యాబోధనపై చర్చించారు. కార్యక్రమంలో సెక్యూరిటీ అధికారి షార్వాన్ వార్డెన్ కోనప్ప, క్రమశిక్షణ కమిటీ సభ్యులు వీరరాఘవరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, వినోద్, కార్తీక్, బ్రహ్మం, సెక్యూరిటీ సిబ్బంది, కేర్ టెకర్స్ పాల్గొన్నారు.


అన్నదానం చేస్తున్న రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యులు

అన్నదానం.. మహాదానం

ప్రజాశక్తి - కొండాపురం


అన్నదానం.. మహాదానమని కొండాపురం ప్రభుత్వ వైద్యులు డాక్టర్ సుజాత తెలిపారు. రెడ్డి కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రతి నెల పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి వచ్చే గర్భిణులకు పౌష్టికాహారం అందించే కార్యక్రమం రెడ్డి కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ కొండాపురం వారు చేస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం కార్యక్రమంలో వైద్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ తల్లి, బిడ్డ క్షేమం కోరి రెడ్డి కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ వారు ప్రతి నెల గర్భిణులకు పౌష్టికాహారం అందించడం ఎంతో శ్రమతో కూడుకున్న పని అన్నారు. విదేశాల్లో ఉద్యోగం చేస్తున్న హైదరాబాద్‌కు చెందిన తిమ్మయ్యగారి క్రిష్ణారెడ్డి మంగళవారం కార్యక్రమానికి ఆర్థికసాయం అందించారని రెడ్డి కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి ఆలమూరు జగన్మోహన్‌రెడ్డి అన్నారు. ఇలా ఆర్థిక సాయం ఎవరైనా అందించవచ్చని తెలిపారు. ఇలా చేసే ఆర్థిక సహాయం ఎంతో విలువైందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో రెడ్డి కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటి మండల నాయకులు హనుమంతరెడ్డి, డాక్టర్ మహదేవరెడ్డి ఆస్పత్రి సిబ్బంది, ఆశా కార్యకర్తలు, 80మంది గర్భిణులు పాల్గొన్నారు.

పాలిసెట్-24 చివరి దశ నోటిఫికేషన్ విడుదల

- ప్రిన్సిపల్ పి.గురుమూర్తిరెడ్డి

ప్రజాశక్తి - మైదుకూరు

2024-25 విద్యా సంవత్సరంలో పాలిటెక్నిక్ కళాశాలలో చేరుటకు చివరి దశ నోటిఫికేషన్ విడుదలైందని మైదుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ పి.గురుమూర్తిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారా ఈనెల 11 నుంచి 13వ తేదీ వరకు ఫీజు చెల్లించవచ్చన్నారు. మైదుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో అనుభవం ఉన్న అధ్యాపకులు ఉన్నారని, మూడేళ్ల డిప్లొమా పూర్తి అయిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. డిప్లమో తర్వాత బీటెక్ చేయుటకు ఈసెట్ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ కూడా ఇవ్వనున్నట్లు ఆయన వివరించారు.


ఎఒకు వినతిపత్రమిస్తున్న డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వి.శివకుమార్

ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగు పట్టణంలో ఆధార్ అప్డేట్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ కోరారు. ఆ మేరకు మంగళవారం స్థానిక ఆర్డిఓ కార్యాలయంలో ఏఓ వెంకటలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నా, విద్యార్థులు స్కూల్స్, కాలేజీలు, హాస్టల్స్‌లలో చేరాలంటే ఆధార్ అప్డేట్ అవసరమన్నారు. ఆధార్ కేంద్రాలు లేకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో పోస్టాఫీస్, స్టేట్ బ్యాంకులో ప్రభుత్వ ఆధార్ కేంద్రాలు ఉండేవన్నారు. అధికారులు స్పందించి ప్రజలు, విద్యార్థుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నామన్నారు. డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు ఎల్లయ్య పాల్గొన్నారు.

పచ్చిరొట్ట ఎరువుల సాగుకు వెనుకంజ


సిద్ధారెడ్డిపల్లె పొలాల్లో జీలగ విత్తనాలు చల్లుతున్న రైతు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి పంట సాగుకు ముందుగా సాగు చేసే పచ్చిరొట్ట ఎరువుల సాగుకు రైతులు వెనుకంజ వేస్తున్నారు. ప్రతి ఏడాది జులై మొదటి వారంలో దుక్కిళ్లు చేపట్టి విత్తనాలు చల్లే వారు. జీలుగ, పెసర, జనుము విత్తనాలను చల్లేవారు. గత 20 రోజులుగా అప్పుడప్పుడు పడుతున్న వర్షాలకు భూములు కూడా పదును కావడంతో రైతులు దుక్కులు చేపట్టారు. పచ్చి రొట్ట ఎరువులు సాగు మాత్రం చేపట్టలేదు. ప్రభుత్వం సబ్సిడీతో జీలగలు, జనుములు కూడా సరఫరా చేసింది. అయితే ఎగువ ప్రాంతాల్లో మంచి వర్షాలు పడకపోవడం, రిజర్వాయర్‌లలో నీటి మట్టం అంతంత మాత్రమే ఉండడంతో రైతులు ఆలోచనలో పడ్డారు. ఆగస్టు మొదటి వారంలో కెసి కాలువకు నీరు విడుదల అవుతాయా లేదా అనే సందిగ్ధంలో పడ్డారు. వర్షాలు సరిగా పడకపోతే కెసి కాలువకు నీరు విడుదల కాదు. దీంతో పచ్చి రొట్టె ఎరువులు సాగు చేసి ఇబ్బందులు ఎదుర్కోవడం ఎందుకని సాగుకు వెనుకంజ వేస్తున్నారు. విత్తనాలు సిద్ధంగా ఉన్నప్పటికీ చల్లకం చేపట్టలేదు. కాలువకు నీరు వచ్చిన తర్వాత వరి నార్లు సాగు చేసి పంటను సాగు చేయొచ్చని రైతులు భావిస్తున్నారు. ఇప్పటికే విత్తనాలను కూడా సేకరించి సిద్ధంగా ఉంచారు. ప్రభుత్వం సబ్సిడీతో జనుము విత్తనాలను బయోమెట్రిక్ విధానంతో రైతులతో రిజిస్ట్రేషన్ చేసుకుని నగదు చెల్లించిన తర్వాత విత్తనాలు ఆర్‌బికెల నుండి సరఫరా చేశారు. 720 క్వింటాళ్ల జనుములు మండలానికి మంజూరు అయ్యాయని మండల వ్యవసాయ అధికారి మ్యాగీ తెలిపారు. బోరు బావులు, నీటి ఆధారాలు ఉన్న రైతులు మాత్రం పచ్చిరొట్ట ఎరువులను సాగు చేపడుతున్నారు. మిగిలిన రైతులు దుక్కిళ్లకే పరిమితమవుతున్నారు. ఈ ఏడాది రెండు మూడు దఫాలుగా పదునైన వర్షాలు పడడంతో పొలంలో గడ్డి అధికంగా మొలకెత్తింది. ఈ నేపథ్యంలో సేద్యాలు చేయక తప్పడం లేదని, ఆర్థికభారం పడుతుందని రైతుల్లో ఆందోళన నెలకొంది.

నిబంధనల మేరకు ఇసుక రవాణా

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రభుత్వ నిబంధనల మేరకు ఇసుక రవాణా చేయాలని సిఐ చాంద్‌బాషా, తహశీల్దార్ నాయక్ పేర్కొన్నారు. స్థానిక వైఎస్ఆర్ సభా భవనంలో మంగళవారం ట్రాక్టర్ల యాజమానులకు ఉచిత ఇసుక పాలసీ విధానాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన స్టాక్ పాయింట్ల వద్ద నుంచే ఇసుకను రవాణా చేయాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎద్దుల బండ్లతో ఇసుకను నది నుంచే రవాణా చేసుకోవచ్చు అన్నారు. ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకే ఇసుకను స్టాక్ పాయింట్ నుండి రవాణా చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త ఇసుక పాలసీని అమల్లోకి తెచ్చిందన్నారు. ఇంటి నిర్మాణాలు చేసే యాజమానులకు ఇసుక అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. రాత్రివేళల్లో పాపాఘ్ని నది నుండి ఇసుక రవాణా చేస్తే కేసు నమోదు, జరిమానా విధిస్తామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, ట్రాక్టర్ల యాజమానులు పాల్గొన్నారు.



ఇసుక నూతన పాలసీపై మాట్లాడుతున్న తహశీల్దార్ నాయక్

విద్యతోపాటు సమాజ సేవలో ముందుండాలి


పుస్తకాలు పంపిణీ చేస్తున్న ప్రధానోపాధ్యాయులు, సంస్థ ప్రతినిధులు

ప్రజాశక్తి - ముద్దనూరు

విద్యార్థులు విలువలతో కూడిన విద్యతోపాటు సమాజ సేవ చేయడంలో ముందుండాలని వివేకానంద ఫౌండేషన్ చైర్మన్ రామకృష్ణారెడ్డి తెలిపారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం వివేకానంద ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివేకానందుని బోధనలు, మానవతా విలువలపై విద్యార్థులకు చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విలువలతో కూడిన విద్య అవసరమన్నారు. ఉన్నత శిఖరాలను అధిరోహించిన మహానుభావులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకొని ఒత్తిళ్లకు గురికాకుండా పట్టుదలతో చదవాలన్నారు. పెడదారిని పట్టకుండా, సమాజంలో వివిధ సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. ప్రధానోపాధ్యాయులు రాజబాబు మాట్లాడుతూ మానవసేవే మాధవసేవ అన్నారు. సమాజంలోని అభాగ్యులు, అనాథలకు సేవ చేస్తున్న ఫౌండేషన్ సంస్థ సభ్యులను కొనియాడారు. సంస్థ తరపున విద్యార్థులకు చేయూతనిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. పదవ తరగతికి చెందిన 90 మంది విద్యార్థులకు ఉచితంగా వివేకానందుడి జీవితం-సందేశం పుస్తకాలను పంపిణీ చేశారు. వివేకానంద సేవాశ్రమానికి పాఠశాల ఉపాధ్యాయులు పద్మనాభరెడ్డి రూ.5వేలు, కుండా భాస్కర్ రూ.5వేలు వితరణ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాధవరెడ్డి, అన్వర్ బాషా, సంస్థ ప్రతినిధులు టి.వెంకట సురేష్, కేతన శ్రీనాథ్ పాల్గొన్నారు.

నేటి నుంచి సౌత్ జోన్ హాకీ క్రీడలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణంలోని వైఎస్సార్ స్పోర్ట్స్ సింథటిక్ హాకీ క్రీడామైదానంలో బుధవారం నుంచి సౌత్ జోన్ హాకీ క్రీడలు ప్రారంభిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ హాకీ సిఇఒ నిరంజన్ రెడ్డి, సెక్రటరీ హర్షవర్ధన్, ట్రెజరర్ థామస్ పీటర్, కడప హాకీ సెక్రటరీ శేఖర్ తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆర్అండ్‌బి అతిథి గృహంలో వారు విలేకరులతో మాట్లాడుతూ సౌత్‌జోన్ హాకీ క్రీడా పోటీలకు కర్ణాటక, తమిళనాడు, కేరళ, పాండిచ్చేరి, తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు 12 టీంలుగా రానున్నట్లు తెలిపారు. 10వ తేదీ నుంచి 17వ తేదీ వరకు హాకీ క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. హాజరైన క్రీడాకారులకు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి సహకారంతో అన్ని సదుపాయాలు ఏర్పాటు చేశామన్నారు. సౌతిండియా క్రీడా పోటీలకు బాలబాలికలు 12 జట్లుగా హాజరవుతారన్నారు. ఇప్పటికే 6 రాష్ట్రాలకు చెందిన హాకీ క్రీడాకారులు పులివెందులకు చేరుకుని, వైఎస్సార్ హాకీ క్రీడా మైదానంలో ప్రాక్టీస్ మ్యాచ్‌లు ప్రారంభించారన్నారు. కార్యక్రమంలో 6 రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు, కోచ్‌లు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న ఎపి హాకీ సిఇఒ

నేడు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాక

రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పులివెందులకు బుధవారం రానున్నారు. పట్టణంలోని వైఎస్సార్ హాకీ క్రీడా మైదానంలో నేటి నుంచి 17వ తేదీ వరకు జరిగే సౌత్ జోన్ హాకీ క్రీడా పోటీలను ఆయన ప్రారంభించనున్నారు. అలాగే కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి కూడా క్రీడా పోటీలను ప్రారంభించనున్నారు. 8

పౌష్టికాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని వైద్యులు సూచించారు. స్థానిక పిహెచ్‌సిలో 70మంది గర్భిణులకు మంగళవారం మండల వైద్యాధికారి రాజేష్ కుమార్, డాక్టర్ శ్రీవాణి ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రక్త హీనత నివారణకు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. పిహెచ్‌సిలో మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. గైనకాలజిస్ట్ డాక్టర్ జ్యోతి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ సరస్వతి , సిబ్బంది, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ధైర్యంగా ముందుకెళ్లాలి : ఎంఇఒ

ప్రజాశక్తి - వేంపల్లె

విభిన్నప్రతిభావంత విద్యార్థులు ధైర్యంగా ముందుకెళ్లాలని మండల విద్యాశాఖ అధికారి జాఫర్ సాదిక్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక భవిత కేంద్రంలో చైతన్య మహిళా మండలి ఆధ్వర్యంలో విద్యార్థులకు వీల్ చైర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఇఒ మాట్లాడుతూ చైతన్య మహిళా మండలి విభిన్నప్రతిభావంత విద్యార్థులను ఆదుకునేందుకు ముందుకు రావడం సంతోషకరమన్నారు. రూ.రెండు లక్షలు విలువ చేసే 20 వీల్ చైర్లు పంపిణీ చేశారు. ఐఇ కో-ఆర్డినేటర్ కేశవరెడ్డి మాట్లాడుతూ దాతల సహకారంతోనే పాఠశాలలు అభివృద్ధి పథంలో నడుస్తాయన్నారు. చైతన్య మహిళా మండలి చైర్మన్ రామాంజనమ్మ మాట్లాడుతూ చైతన్య మహిళా మండలి ఆధ్వర్యంలో మహిళలు, బాలికల అభ్యున్నతికి పని చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 స్టాలిన్, చైతన్య మహిళా మండలి సభ్యులు నాగన్న, మైఖేల్, మేరి ఎస్తేరు, పాస్టర్ స్టీఫెన్ పాల్, మాణిక్య రావు, మెయిన్ పాఠశాల హెచ్ఎం రాజేశ్వరి, ఫిజియోథెరపీ ఆనంద్, ఐఇఆర్టీలు యశోద, సుజాత పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో ఉచిత ఫిజియోథెరపీ

ఎర్రగుంట్ల : స్థానిక రెండవ వార్డులో ఎంపీపీ స్కూల్‌లో ఉన్న భవిత కేంద్రంలో ప్రతి మంగళవారం ఫిజియోథెరపీ క్యాంప్ ఉచితంగా నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖ అధికారులు శివప్రసాద్, వెంక టేశ్వర్లు తెలిపారు. మంగళవారం భవిత కేంద్రంలో నిర్వహిస్తున్న ఉచిత ఫిజియోథెరపీ శిబిరాన్ని వారు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఉన్న శారీరక వైకల్యం, మానసిక వైకల్యంగల 6 నుండి 18 సంవత్సరాల వయసులోపు వారు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భవిత కేంద్రంలో పేరు నమోదు చేయించి, ఉచిత ఫిజియోథెరపీతోపాటు పలు అలవెన్సులు ప్రభుత్వం ద్వారా అందు తాయన్నారు. ఉచిత ఫిజియోథెరపీ ప్రతి మంగళవారం డాక్టర్ సతీష్ కుమార్ రెడ్డి, ఐఈఆర్ పి.రవికుమార్ ఆధ్వర్యంలో జరుగుతాయని తెలిపారు.

రేపు గదుల వేలం పాట

ఎర్రగుంట్ల : నగర పంచాయతీ పరిధిలోని పాత నగర పంచాయతీ కార్యాలయం ముందు ఉన్న గదుల బాడుగకు సంబంధించి ఈనెల 11న ఉదయం 11 గంటలకు నూతన నగర పంచాయతీ కార్యాలయంలో వేలం పాట నిర్వహిస్తున్నట్లు కమిషనర్ రామకృష్ణయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాల్గొనదలచిన వారు ఒసి అయి ఉండి, వెయ్యి రూపాయలు చెల్లించాలని తెలిపారు. నెలకు అద్దె రూ.1,350 ఉంటుందన్నారు. గుడ్ విల్ కింద రూ.5,000 నగర పంచాయతీకి చెల్లించాలని తెలిపారు.


వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

అంగన్వాడీ సమస్యలను పరిష్కరించాలని జమ్మలమడుగు సిఐటియు అధ్యక్ష, కార్యదర్శులు జి ఏసుదాసు దాసర్ విజయ్ కోరారు. మంగళవారం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ బాషాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తాము అధికారంలోకి వస్తే అంగన్వాడీలకు జీతాలు పెంచుతామని, ఐసిడిఎస్‌లను బలోపేతం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. కానీ కేంద్రంలో మూడోసారి బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఇప్పటికీ అంగన్వాడీల పట్ల మొండి వైఖరి చూపుతానే ఉన్నారన్నారు. బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దుచేసి, కార్మిక హక్కులను కాల రాయడానికి ప్రయత్నం చేస్తోందన్నారు. బీజేపీ ప్రభుత్వానికి నిరసనగా సిటు ఆల్ ఇండియా పిలుపులో భాగంగా ఈనెల 10న నిరసనలు చేస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో నరేంద్ర, దివాకర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య

జగన్ పాలనలో ఇసుక దోపిడీ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

జగన్ పాలనలో ఇసుకను దోపిడీ చేయడమేకాక, భవన నిర్మాణ కార్మికుల జీవితాలు రోడ్డున పడ్డాయని మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య తెలిపారు. టిప్పర్ ఇసుక రూ.9 వేల నుండి రూ.10వేల దాకా అమ్మిన ఘనత నాటి వైసిపి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. స్థానిక నెహ్రూ రోడ్డులోని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు టిడిపి అధికారంలోకి రాగానే 43 జిఒ తెచ్చి పాత పాలసీని రద్దు చేశారన్నారు. ప్రజలకు ఉచితంగా ఇసుక ఇస్తామని ప్రకటించారన్నారు. సీనరేజ్, జీఎస్టీ, బాడుగ మాత్రం చెల్లించాలన్నారు. దీనికోసం ఒక పాలసీని తయారు చేశామన్నారని, ఇందులో ఆయా జిల్లాల కలెక్టర్లు కమిటీ చైర్మన్‌గా వ్యవహరిస్తారన్నారు. అన్ని ప్రాంతాల్లోని ఇసుకరీచులపై ఈ కమిటీలే నిర్మాణాత్మకంగా వ్యవహరిస్తారన్నారు. ఆన్‌లైన్ ద్వారానే పేమెంట్లు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఘంటసాల వెంకటేశ్వర్లు, మాజీ కౌన్సిలర్ వెంకటరమణ పాల్గొన్నారు.


మంత్రితో మాట్లాడుతున్న బీటెక్ రవి

మంత్రుల దృష్టికి పులివెందుల సమస్యలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను టిడిపి ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి విజయవాడలో మంగళవారం వ్యవసాయ శాఖ, పశుసంవర్ధక, పాడి పరిశ్రమల, మార్కెటింగ్, సహకార, మత్స్యకారు శాఖ, మంత్రివర్యులు కింజరాపు అచ్చెన్నాయుడు, రెవెన్యూ శాఖ మంత్రి అనగానే సత్య ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. వారిని కలిసి సమస్యలను వివరించారు. ఇందుకు స్పందించిన మంత్రులు పులివెందుల నియోజకవర్గంలోని సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు.

మంత్రి 'మండిపల్లి'ని కలిసిన బీరం విద్యా సంస్థల అధినేత సుబ్బారెడ్డి

ప్రజాశక్తి - ఖాజీపేట



కడప నగరంలోని ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్‌లో రాష్ట్ర రవాణా, క్రీడల, యువజన శాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డిని బీరం పాఠశాల కరెస్పాం డెంట్ బీరం సుబ్బారెడ్డి మంగళవారం మర్యాద పూర్వకంగా కలి శారు. ఈ సందర్భంగా బీరం సుబ్బారెడ్డి మంత్రికి పుష్పగుచ్ఛమిచ్చి అభినందనలు తెలిపారు.

చావిడిలో కొలువుదీరిన పీర్లు

ప్రజాశక్తి - ముద్దనూరు

మొహరం పర్వదినం పురస్కరించుకుని మండల కేంద్రంలోని పీర్ల చావిడిలో మంగళవారం అంగరంగ వైభవంగా పీర్లు కొలువుదీరాయి. ఈనెల 14, 15న ఊరిలో తిరుగుట (చిన్న సరగత్తు), 16న విడి దినం, 17న పీర్లు ఏటికి(మక్కా)పోతాయని కమిటీ సభ్యులు తెలిపారు. 16న అబ్దుల్ ఖాదర్, జిందా బాషా (ఫేమస్ బ్రదర్స్) ఇంటి వద్ద నుండి స్వామి వారికి చదివింపులు (పాల షరబత్ పూల షహారాలు) తీసుకుని మెయిన్ బజార్ నుండి పీర్ల చావిడికి చేరుకుంటుందని పేర్కొన్నారు. రాత్రికి గుండం కాల్చు కార్యక్రమం ఉంటుందన్నారు. 17న ఏటికి(మక్కాకు)పోతాయన్నారు. ఆయా కార్యక్రమాలను విజయవంతం చేయాలని మొహరం కమీటీ సభ్యులు కోరారు.



క్రైం కార్నర్

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి - కొండాపురం

మండలంలోని పొట్టిపాడు గ్రామ పరిధిలో పేకాట ఆడుతుండగా దాడి చేసి ఏడు మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ యోగేంద్ర తెలిపారు. వీరి నుంచి రూ.23,910 స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

ప్రజాశక్తి - గోపవరం

మండలంలోని బద్వేల్ పట్టణ పరిధిలోని హెచ్‌పి పెట్రోల్ బంక్ వద్ద మంగళవారం గోపవరం తహశీల్దార్ రోశయ్య, వీఆర్వో చెన్నకేశవ, ఎస్ఇబి ఎస్ఐ మోహన్‌బాబు, పోలీస్ సిబ్బంది జరిపిన దాడుల్లో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. బద్వేల్‌కు చెందిన వెంకటకృష్ణకు రూ.10,000 అపరాధ రుసుం వేశారు. మొదటిసారి చేసిన కార ణంగా హెచ్చరించారు. ఎవరైనా అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ రోశయ్య హెచ్చరించారు.